ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 7 అక్టోబరు 2025 | 3



స్వచ్ఛాంధ్రా ముగ్గు



90శాతం దివ్యాంగత్వం ఉన్నా.. పెన్షన్ రావడం లేదు..

'మాది కాకినాడ అర్బన్ ప్రాంతమైన దుమ్ములపేట. నా పేరు పెమ్మాడి సూరిబాబు. నాకు వివాహమై భార్య, ముగ్గురు పిల్లలున్నారు. నాకు 90శాతం దివ్యాంగత్వం ఉన్నా మూడేళ్లుగా పింఛను రావట్లేదు.. దీనిపై జేసీకి అర్జీ సమర్పించాను. నాకు పింఛను ఇచ్చి ఆదుకోండి..'



పింఛను రావట్లేదు.. సమస్య పరిష్కరించండి

ఈ బాలుడు శారీరక, మానసిక దివ్యాంగుడు. పేరు ఏలేటి మనోజ్. వయసు 12ఏళ్లు. ఆధార్ అప్‌డేట్, పింఛను మంజూరు చేయాలని కలెక్టరేట్‌కు తీసుకువచ్చారు. అతడి పరిస్థితి కారణంగా ఆధార్ సాంకేతిక సమస్య ఎదురై సదరమ్ కావడంలేదు. దీంతో పింఛను అందుకోలేకపోతున్నాడు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫొటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఓట్ల చోరీతోనే బీజేపీకి అధికారం 5

» ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం



అచ్చెరువొందేలా!

» జిల్లాలో రూ.65కోట్లతో 50 చెరువుల అభివృద్ధి

» కేంద్రం నుంచి నిధులు రాబట్టేలా కలెక్టర్ ప్రణాళిక

» ఒక్కో చెరువు రిపేర్, రెనోవేషన్, రెస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) విధానంలో అభివృద్ధి

» తుని నియోజకవర్గంలో 26, ప్రత్తిపాడు 4, పిఠాపురంలో 3, జగ్గంపేటలోను కొన్ని ఎంపిక

» అత్యధికంగా కోటనందూరు మండలంలో 15చెరువుల రూపురేఖల మార్పు

» అన్నదాతలకు తీరనున్న సాగునీటి బెంగ

» ఆయా చెరువుల అభివృద్ధికి రూ.కోటి నుంచి రూ.కోటిన్నర వరకు ఖర్చు అంచనా

» చెరువుల ఆయకట్టు ఆధారంగా అంచనాలు సిద్ధం చేస్తోన్న జలవనరులశాఖ

తుని నియోజకవర్గం కోటనందూరు మండలంలోని అల్లిపూడిలో రావుల చెరువు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చెరువులను పెద్దఎత్తున అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సాగునీటి లభ్యత భారీగా లేనిచోట్ల చెరువులపై ఆధారపడి వ్యవసాయం చేసే అన్నదాతలకు అండగా నిలబడేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. చెరువులపై ఆధారపడ్డ ఆయకట్టుకు నీటి బెంగ లేకుండా చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం జిల్లాలో 50 చెరువులను ఎంపిక చేసింది. ఒక్కోదాన్ని పూడికతీత మొదలు చెరువు బండ్ అభివృద్ధి, కాలువల అభివృద్ధి చేసి సజావుగా సాగునీరు అందేలా ప్రణాళికలు తయారుచేసింది. ఒక్కో చెరువును ఆర్‌ఆర్‌ఆర్ విధానంలో అభివృద్ధి చేయడానికి రూ.కోటినుంచి రూ.కోటిన్నర వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తోంది. తద్వారా రూ.65కోట్ల వరకు నిధులు అవసరమని భావిస్తున్నారు. ప్రస్తుతం ఏ చెరువుకు ఎంత వ్యయం అవుతందనేదానిపై జలవనరులశాఖ అధికారులు తుది అంచనాలు రూపొందిస్తున్నారు. ఎంపిక చేసిన 50 చెరువుల్లో ఒక్క తుని నియోజకవర్గంలోనే 26 ఉండడం విశేషం. ఇక్కడ నీటి ప్రాజెక్టుల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చెరువుల పైనే రైతులు సాగు చేస్తుండడంతో ఎక్కువ చెరువులను ఎంపిక చేశారు. త్వరలో కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు వచ్చేలా జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపనున్నారు.

బెంగ లేదిక..

జిల్లాలో గోదావరి, ఏలేరు, పంపా ప్రాజెక్టుల తోపాటు ఇతర చిన్నాచితకా సాగునీటి పథకాల ద్వారా రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. కానీ ఈ నీటి లభ్యత లేని అనేక మండలాల్లో ఇప్పటికీ అన్నదాతలకు చెరువులే ఆధారం. వీటి ద్వారా వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. కానీ ఎన్నో ఏళ్లుగా వీటిని పట్టించుకోకపోవడంతో పూర్తిగా పూడిక పెరిగిపోయి, కుచించుకుపోయి నీటినిల్వ సామర్థ్యం క్షీణించిపోయింది. కాలువలు సైతం ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ప్రధానంగా తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో చెరువులు భారీగా ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో అనేక భారీ చెరువులే పంటల సాగుకు ఆధారం. తీరా వీటిపై ఆధారపడ్డ రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందని పరిస్థితి. ఈ నేపథ్యంలో వీటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణంగా చెరువుల్లో పూడికతీత వరకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయడానికి వీలుంది. కానీ అంతకుమించి అభివృద్ధి చేయాలంటే నిధుల సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో చిన్నతరహా నీటి వనరుల అభివృద్ధి కింద కేంద్ర ప్రభుత్వం నుంచి చెరువుల ఆధునికీకరణకు ప్రత్యేకంగా గ్రాంటు ఉన్నా అధికారులు పెద్దగా దృష్టిసారించలేదు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ చెరువుల అభివృద్ధిపై దృష్టిసారించారు. వీటి అభివృద్ధికి పక్కాగా అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపితే నిధులు విడుదలయ్యే అవకాశం ఉండడంతో ఆ దిశగా అడుగులు వేశారు. ఇందుకోసం జిల్లాలో తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో 33 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రిపేర్, రెనోవేషన్, రెస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) విధానంలో వీటి రూపురేఖలు మార్చాలని భావిస్తున్నారు.

మెట్టపై దృష్టి

తుని నియోజకవర్గంలో చెరువులపై ఆధారపడి సాగుచేసే రైతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఇక్కడ 26 చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో ఒక్క కోటనందూరు మండలంలోనే ఏకంగా 16 చెరువులను గుర్తించారు. జిల్లాకు చివరనున్న ఈ మండలానికి ఏ నీటిపారుదల ప్రాజెక్టు పెద్దగా అందుబాటులో లేదు. దాదాపు అంతా చెరువులపైనే ఆధారపడి సాగుచేస్తున్నారు. దీంతో ఈ మండలంలోనే 16 చెరువులను గుర్తించారు. లక్ష్మీదేవిపేటలో రామమ్మ చెరువు, కేఈ చిన్నయ్యపాలెంలో పెద్దట్యాంకు, కె.కొట్టాం గ్రామంలో ఖండి చెరువు, ఎస్‌ఆర్‌పేటలో సింహాద్రి సాగరం చెరువు, బీహెచ్‌కోటలో దండేశ్వరం, అల్లిపూడిలో రావుల, పెద్ద చెరువులు, కె.కొట్టాంలో బాబుల చెరువు, కోటనందూరు గ్రోయిన్, కామినీడువారిగ్రోయిన్,దిగువుల, బీహెచ్ కోట, జగన్నాథపురంలో జగ్గరాజు చెరువు, గండేపల్లి, బిల్లనందూరులో బొండుగెడ్డ సిస్టం, ఎర్ర చెరువు, తిమ్మరాజు చెరువు, ఎస్‌ఎస్‌వీ నగరంలో శ్రీకృష్ణ సాగరం, తుని మండలంలో గంగుల చెరువు, నారప్ప చెరువు, సీతయ్య, ఎర్రబిల్లవాక, తొండంగిలో గాబు ఊర చెరువు, కొత్త చెరువు, పెద్ద కాగితాలమ్మ, సన్యాసి, నూకన్న, పాపయ్య చెరువులను ఎంపిక చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో శంఖవరంలో పెదబాపన్నదొర చెరువు, ఎర్ర చెరువు, రౌతులపూడిలో పెద్ద ట్యాంకు, కుడుముపాత్రుని చెరువు, పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో చేబ్రోలులోని రావుల, ఎర్రబంద, కోట్లనకవారి చెరువు, చెందుర్తిలో అచ్చియ్యఆవ, పెద్ద, వెంకటపతి రాజు, సింగరాజు, కొత్త చెరువులను అభివృ ద్ధిచేయనున్నారు. మొత్తం 50 చెరువుల్లో పూడికతీత,బండ్, కాలువల అభివృద్ధికి ఆయాచెరువు విస్తీర్ణం ఆధారంగా రూ.కోటినుంచి రూ.కోటిన్నర వరకు ఖర్చు కానుంది. ఏ చెరువును ఎలా అభివృద్ధి చేయాలనేదానిపై జిల్లా జలవనరుల శాఖ అధికారులు ప్రస్తుతం సర్వే ద్వారా అంచనాలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం అన్నీ కలిపి రూ.65కోట్ల వరకు వ్యయం కానుందని ప్రాథమికంగా అంచనాలు సిద్ధం చేశారు. కాగా మరో రెండువారాల్లో చెరువుల వారీగా అంచనాలు సిద్ధం కానున్నాయి. ఆ తర్వాత ఈ ప్రతిపాదనలను కలెక్టర్ కేంద్రానికి పంపనున్నారు. వీటికి నిధులు కూడా వేగంగానే విడుదల అయ్యే అవకాశం ఉండడంతో అనుమతులు రాగానే టెండర్లు పిలిచి చెరువులను పూర్తిస్థాయిలో రూపురేఖలు మార్చి అన్నదాతలకు సాగునీటి బెంగ లేకుండా చేయనున్నారు.



చెరువుగా అభివృద్ధి చెందనున్న మెట్ట ప్రాంతంలోని తుమ్మల ట్యాంకు ప్రాంతం

ఆదర్శ సమాజ సాధన లక్ష్యంగా..

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

» కాకినాడలో జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర-2025 అవార్డుల ప్రదానం



స్వచ్ఛాంధ్ర- 2025 అవార్డుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్(కాకినాడ),అక్టోబరు6(ఆంధ్రజ్యోతి):ఆరోగ్యం,ఆహ్లాదం వెల్లివిరిసే ఆదర్శసమాజ సాధన లక్ష్యంగా స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్రా ఉద్యమాన్ని నిత్యజీవన సరళిగా కొనసాగించాలని కలెక్టర్ షాన్‌మోహన్ జిల్లా ప్రజలను కోరారు. కాకినాడ రాజాట్యాంక్ సమీపంలోని గోదావరి కళాక్షేత్రం ఆడిటోరియంలో కాకినాడ జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్రా-2025 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్, పంచాయతీరాజ్ తదితరశాఖల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ముఖ్యఅతిథిగాను, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన విశిష్ట అతిథులుగా హాజరై వివిధ కేటగారీల కింద ప్రామాణిక సూచికల సాధనలో విశిష్ట ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో ఉత్తమంగా ఎంపికైన సంస్థలు, శాఖలు, వ్యక్తులకు స్వచ్ఛాంధ్ర-2025 అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈ ఏడాది మన జిల్లా రాష్ట్రస్థాయిలో రెండు, జిల్లాస్థాయిలో 15 కేటగిరీల్లో 50 అవార్డులు అందుకోవడంపట్ల హర్షం చేశారు. ఇందుకు అంకితభావం, పోటీతత్వంతో కృషి చేసిన వారందరినీ ఆయన అభినందించారు. స్వచ్ఛతాలక్ష్యాల సాధనకు కృషిచేసిన వారిని అభినందిస్తూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో మరింతమంది చురుగ్గా పాల్గొనేందుకు ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏటా నిర్వహిస్తోందన్నారు. ఈ ఏడాది సాధించిన అవార్డుల స్ఫూర్తితో వచ్చే ఏడాది మరిన్ని ఎక్కువ అవార్డులు సాధించేందుకు కృషిచేయాలని ప్రభుత్వశాఖలు, స్వచ్ఛాంధ్ర సంస్థలను కోరారు. విశిష్టఅతిథి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛవాతావరణంవల్ల శారీరక, మానసికఆరోగ్యం పెంపొందుతుందని, ఆరోగ్యమే వెలలేని భాగ్యమని తెలిపారు. అందుకే రాష్ట్రప్రభుత్వం గత జనవరి నెల నుంచి ప్రతి 3వశనివారం రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ఉద్యమంలా నిర్వహిస్తోందన్నారు. స్వచ్ఛసమాజ సాధనకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.

కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన మాట్లాడుతూ స్వచ్ఛత, పరిశుభ్రతల్లో దైవత్వం ప్రతిబింబిస్తుందన్నారు. కేంద్రం నిర్వహిస్తున్న స్వచ్ఛసర్వేక్షణ్, రాష్ట్రం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో కాకినాడ నగరం మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. అనంతరం అవార్డుల ప్రదానోత్సవంలో ముందుగా రాష్ట్రస్థాయిలో స్వచ్ఛపరిశ్రమలు(ఎంఎస్‌ఎంఈ) కేటగిరీలో అవార్డు అందుకున్న ఎలైట్‌ఇన్‌స్ట్రూమెంట్స్ సంస్థను, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్ కేటగిరీలో అవార్డు అందుకున్న వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. తదుపరి 15కేటగిరీల్లో 50జిల్లాస్థాయి అవార్డులకు ఎంపికైన వారికి కలెక్టర్, ఎమ్మెల్సీ అవార్డులు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, డీఈవో పి.రమేష్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆలీ, మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, కార్పొరేషన్ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్ పాల్గొన్నారు.





స్వచ్ఛ అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనర్ భావన



స్వచ్ఛాంధ్ర ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న చేబ్రోలు సర్పంచ్ లోవతల్లి, కార్యదర్శి రాజు

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

» జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా.. కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 418 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రాహుల్ మీనా

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో సోమవారం జిల్లాస్థాయి పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీమాట్లాడుతూ ఆయా శాఖల్లో నమోదైన అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. బియ్యంకార్డుల మంజూరు, కార్డుల్లో పేర్ల మార్పు లు-చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్లస్థలాలు, ఆన్‌లైన్‌లో భూమివివరాల నమోదు, భూముల రీసర్వే, ఆక్రమణల తొలగింపు వంటి అంశాలపై 418 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కాకినాడ జీజీహెచ్ పరిపాలనాధికారి శ్రీధర్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, సీపీవో త్రినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 52 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానికంగా పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 52 మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. 15 భూతగదాలు, 17 కుటుంబ కలహాలు, 20 వివిధ కేసులకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ వీడియో సమావేశం నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనివారు పోలీస్‌స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నిండా ముంచిన పత్తి

» ఎకరానికి రూ.లక్ష వరకు కోల్పోయిన రైతులు

» 2వేల వేల ఎకరాల్లో పంటకు నష్టం

» చనిపోతున్న మొక్కలు.. విడవని పత్తి



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఎండిపోతున్నట్టుగా మారి చనిపోతున్న పత్తి పంట

(గొల్లప్రోలు రూరల్-ఆంధ్రజ్యోతి)

పత్తి రైతులు నిండా మునిగారు. విత్తనాల్లో లోపంతో మొక్కలు చనిపోవడంతోపాటు కాయలు కాసినా పత్తి విడవకపోవడం, విడిచినా డొల్లు పత్తి రావడంతో ఎకరానికి లక్ష రూపాయల వరకు కోల్పోయారు. 2వేల ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్టు చెప్తున్నారు. ఇంత జరిగినా విత్తన కంపెనీ ప్రతినిధులు అధికారులు తమను పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, దుర్గాడ, చెందుర్తి, తాటిపర్తి, చిన జగ్గంపేట, వన్నెపూడి, కొడవలి, ఎ.విజయనగరం గ్రామాలతోపాటు జిల్లాలోని మెట్ట మండలాల్లో రైతులు ఎక్కువగా పత్తి పంట సాగు చేస్తారు. ఈ ఏడాది సాగు చేసిన పంట ఏపుగా ఎదిగినట్టు కనిపించినా కాయలు పక్వానికి వచ్చేసరికి లోపాలు బయటపడ్డాయి. ఓ కంపెనీకి చెందిన ప్లాటినం పత్తివిత్తనాల్లో ఈ పరిస్థితి కనిపించింది. మొక్కలు ఏపుగా ఎదిగి కాయలు కాసినా పత్తి విడవకపోవడం, విడిచినా డొల్లు పత్తి రావడం, మొక్కలు గిడసబారినట్టు మారి ఎండిపోతుండడంతో రైతుల్లో కలవరం మొదలైంది. నెలరోజులుగా ఇదే పరిస్థితి కొనసాగడంతో రైతులు కంపెనీ ప్రతినిధులు, తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణదారులకు తెలిపారు. వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేబ్రోలులోని విత్తన దుకాణం వద్ద శనివారం రాత్రి ఆందోళన నిర్వహించారు.

భారీ నష్టం

ఓ కంపెనీ విత్తనాలతో పత్తి సాగు చేసిన రైతులకు భారీనష్టం వాటిల్లింది. ఎకరానికి లక్ష రూపాయల వరకు పెట్టిన పెట్టుబడి, కౌలు సొమ్ము కోల్పోయామని రైతులు తెలిపారు. గతేడాది రూ.50వేల నుంచి రూ.1.2లక్షల వరకు ఆదాయం వచ్చిందని, ఇప్పుడు పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2వేల ఎకరాల్లో పత్తి పంటకు ఈ విధంగా నష్టం జరగ్గా చేబ్రోలులోనే 400 ఎకరాల వరకు ఉన్నట్టు చెప్తున్నారు.

పదేళ్లలో ఇదే తొలిసారి

-దూళిపూడి వెంకటరావు, రైతు, చేబ్రోలు



నేను పదేళ్లుగా పత్తి సాగు చేస్తున్నాను. ఇటువంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదు. ఒక ఎకరంలో ప్లాటినం, మరో ఎకరంలో ఇతర కంపెనీ పత్తి విత్తనాలు వేయగా ప్లాటినం విత్తనాలు నాటిన పొలంలోని మొక్కలే చనిపోతున్నాయి. ఇప్పటికే ఎకరానికి లక్ష వరకు నష్టం వచ్చింది.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

-ఓరుగంటి సూర్యచంద్రశేఖర్, రైతు, చేబ్రోలు



రెండుఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. కాయ పగిలే సమయానికి పత్తి మొక్క గిడసబారి గుడ్డిపత్తిలా పేలుతోంది. అదే సమయంలో మొక్కలు చనిపోతున్నాయి. దీనివల్ల పంటపై పెట్టిన పెట్టుబడిని పూర్తిగా కోల్పోతున్నాం. కంపెనీ ద్వారా ఎకరానికి రూ.లక్ష పరిహారం ఇప్పించాలి.

పత్తి రైతుల ఆందోళన

పిఠాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నాణ్యత లేని విత్తనాలతో తీవ్రంగా నష్టపోయామని, తమకు పరిహారం ఇప్పించడంతోపాటు ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలుసహా పలు గ్రామాల పత్తి రైతులు సోమవారం పిఠాపురంలోని పాడా కార్యాలయంవద్ద ఆందోళన నిర్వహించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు తమకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ పాడా పీడీ వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు.

పంట పొలాలను పరిశీలిస్తాం

-కేవీవీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి, గొల్లప్రోలు

చేబ్రోలు తదితర గ్రామాల్లో రైతులు వ్యక్తం చేస్తున్న ఆవేదనపై శాస్త్రవేత్తలతో కలిసి పత్తి పంట పొలాలను పరిశీలిస్తాం. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు విత్తనాల్లో లోపంపై పరిశీలన జరుపుతాం.

'రంగరాయ'లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు

» కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాసు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. కాకినాడ జీజీహెచ్‌ను ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన పథకంలో చేర్చి అభివృద్ధిచేయాలని కోరగా ఈ పథకం ద్వారా కేవలం ప్రభుత్వ వైద్యకళాశాలల్లో అభివృద్ధి పనులు చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో రంగరాయ వైద్యకళాశాలను పీఎంఎస్‌ఎస్‌వై పథకంలో చేర్చి 330 పడకల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిని కోరామని ఎంపీ తెలిపారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు రావాలని ఆయన కోరారు.

వ్యాపారి హత్య 5

నాన్న.. మాకు దిక్కెవరూ!

రాయి కాదు జ్ఞాపకం



మృతి చెందిన గ్రామ పెద్ద జ్ఞాపకంగా ఏర్పాటు చేసుకున్న బండరాయిపై ధాన్యం, బియ్యం, పప్పులు ఉంచిన పావురులంక ఆదివాసీలు



"గ్రామ పెద్ద... వలస ఆదివాసీ గ్రామాల్లో ఆయన మాటే శాసనం. ఆయన నిర్ణయమే శిరోధార్యం. పండుగ జరుపుకోవాలన్నా, వ్యవసాయ పనులు మొదలు పెట్టాలన్నా, పెళ్లిళ్లు నిశ్చయించాలన్నా ఆయనదే నిర్ణయాధికారం. దానిని దాటి ఎవరైనా ఒక్క అడుగు వేసినా అపచారం. అది వారి విశ్వాసం. అటువంటి గ్రామ పెద్ద కాలం చేస్తే ఊరంతా కలిసి ఓ పెద్ద తంతే జరుపుకుంటారు. ఆయన పేరిట ఓ బండరాయిని మూడు దారుల కూడలిలో ఏర్పాటు చేసుకుంటారు. జీవించినంత కాలం గ్రామ పెద్దకు ఇచ్చిన గౌరవాన్నే ఆ రాయికీ ఇస్తారు. దానిపై అల్లుడిని కూర్చోబెట్టి పూజ చేస్తారు. ఆ నిమిషం నుంచి గ్రామ పెద్ద ఆత్మ అతని అల్లుడిలో ప్రవేశిస్తుందని వారి నమ్మకం. ఇదంతా చూడ్డానికి వింతగా ఉన్నా వారి ఐక్యతకు మాత్రం ఓ పెద్ద నిదర్శనం. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పావురులంకలో ఇటీవల జరిగిన ఈ తంతు విశేషాలు తెలుసుకుందాం..."

- బండరాయికి మరణించిన గ్రామ పెద్దలా గౌరవ, మర్యాదలు
- అల్లుడిలో అతడి ఆత్మ ప్రవేశిస్తుందని వారి విశ్వాసం
- రాయిపై కూర్చోబెట్టి పూజలు
- ఇదీ వలస ఆదివాసీల ఆచారం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఛత్తీస్‌గఢ్ నుంచి పలు కుటుంబాలు కొన్నేళ్ల క్రితం వివిధ కారణలతో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి వలస వచ్చాయి. ఆ కుటుంబాలు అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిలాలతో పాటు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ తదితర జిల్లాల్లో జీవనం సాగిస్తున్నాయి. కొన్ని కుటుంబాలు ఒడిసా, మహారాష్ట్రల్లోని పలు జిల్లాలకు వలస వెళ్లాయి. వారంతా అటవీ ప్రాంతంలో గ్రామాలు ఏర్పాటు చేసుకుని పోడు సాగుతో బతుకు బండి లాగుతున్నారు. ఏ కుటుంబమైతే అందరికంటే ముందుగా వచ్చి అడవిలో నివాసం ఏర్పాటు చేసుకుని గ్రామం నెలకొల్పుతుందో ఇక అప్పటి నుంచి ఆ కుటుంబ పెద్దే గ్రామ పెద్దగా వ్యవహరించడం వారి కట్టుబాట్లలో ప్రధానమైనది. ఆ తర్వాత వలస వచ్చిన కుటుంబాలన్నీ గ్రామ పెద్ద మాటే శిరోధార్యంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో గ్రామ పెద్ద మృతి చెందితే ఊరంతా ఏకమై ఓ పెద్ద తంతే జరుపుకుంటుంటారు. దహన సంస్కారాలు పూర్తయిన నెల రోజలకు ఊరిలోని వారంతా సమీపంలోని అడవిలోకి వెళ్లి కాసింత పలచగా, పలకలగా ఉన్న బండరాయి కోసం అన్వేషిస్తారు. వారు అనుకున్న మాదిరి బండరాయి లభ్యం కాగానే దానిని జడ్డీపై మోసుకుని ఆ ఊరికి చేరుకునే మూడుదారుల కూడలికి తీసుకొస్తారు. (సహజంగా వలస ఆదివాసీ గ్రామం చేరుకోవాలంటే మూడు, అంతకు పైనే కాలిబాటలు ఉంటాయి). అలా చేరుకున్నాక ఆ బండరాయి జడ్డీపై మృతి చెందిన గ్రామ పెద్ద మేనల్లుడినో లేదా కూతురు భర్తనో ఎక్కించుకుని కూడలి చుట్టూ ఐదు పర్యాయాలు ప్రదక్షిణ చేస్తారు. ఆ సమయంలో బండరాయి జడ్డీపై కూర్చున్న అల్లుడు డోలు కొయ్య వాయిస్తాడు. ఐదుసార్లు ప్రదక్షిణ జరిపాక జడ్డీని కిందకు దింపుతారు. అనంతరం మహిళలంతా కలిసి బండరాయిపై కూర్చున్న అల్లుడికి పసుపు పూసి బిందెలతో తలపై నీళ్లు పోస్తారు. ఈ తంతు ముగిసాక మృతి చెందిన గ్రామ పెద్ద కుటుంబీకులు, బంధువర్గం బండరాయిపై కూర్చున్న అల్లుడి కండువా చెంగులో రూపాయి నుంచి ఐదు రూపాయల వరకు పెడతారు. అప్పటినుంచీ కాలం చేసిన గ్రామ పెద్ద ఆత్మ ఆ బండరాయిపై కూర్చున్న అల్లుడిలో ప్రవేశిస్తుందని వారి నమ్మకం.



జడ్డీపై తీసుకొస్తుండగా డోలు వాయిస్తున్న గ్రామ పెద్ద అల్లుడు

ఈ తంతు ముగిసాక బండరాయిని మహిళలు శుభ్రంగా కడిగి పసుపు బొట్లు పెడతారు. ఆ బండరాయిపై ధాన్యం, పప్పులు, చుట్ట... ఇట్లా కొన్ని వస్తువులు ఉంచి మూడుదారుల కూడలిలో ఉంచుతారు. ఆ క్షణం నుంచీ ఆ రాయికి జీవించినంత కాలం గ్రామ పెద్దకు ఇచ్చిన గౌరవ మర్యాదలే ఇస్తారు. ఆ రోజు నుంచి గ్రామానికి చెందిన ఎవరైనా సరే వేరే ఊరు వెళ్లి వస్తున్నా, సంతకు వెళ్లి వస్తున్నా ఆ మూడుదారుల కూడలి వద్ద కొద్ది నిమిషాలు పాటు ఆగి గ్రామ పెద్ద పేరిట నెలకొల్పిన బండరాయిపై ఆయనకు ఇష్టమైన తినుబండారాలు గానీ, చుట్ట-బీడీ గానీ, సారా, కల్లు గానీ ఉంచి దండం పెట్టుకుంటుంటారు. ఈ తంతు కేవలం ఊరి పెద్దకు మాత్రమే జరుపుతారు. అంటే ఈ తరహా గౌరవం గ్రామ పెద్దకు మాత్రమే పరిమితమన్న మాట. ఇతరులెవ్వరూ మృతి చెందినా సాధారణ కార్యక్రమాలే నిర్వహిస్తారు.



మృతి చెందిన గ్రామ పెద్ద జ్ఞాపకంగా మూడు రహదారుల కూడలి వద్ద ఏర్పాటు చేసుకున్న బండరాయిని శుభ్రం చేస్తున్న కుటుంబీకులు


చూడ చక్కని వేడుక...
13 వాహనాల కలయిక

- అంబాజీపేటలో రేపు విజయభేతాళ ఉత్సవం
- అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు




విజయ భేతాళస్వామి

అంబాజీపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయభేతాళ ఉత్సవం... అనగానే ముందుగా గుర్తుకొచ్చేది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట. శరన్నవ రాత్రుల్లో భాగంగా ఇక్కడ 58 సంవత్సరాలుగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. 59వ వార్షికోత్సవాన్ని అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. అనుకున్న లక్ష్యం సాధించేందుకు భేతాళుని పూజించడం ఇతర దేశాల నుంచి అనాదిగా వస్తున్న సంప్రదాయం. కలశస్థాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం పది రోజులు కొనసాగింది. అమ్మవారితో పాటు భేతాళునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వాహనాలను విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించి దైవ రూపాలను పురవీధుల్లో ఊరేగిస్తూ అంబాజీపేట సెంటరుకు చేరుకుంటారు. చెడీతాలింఖానా, కర్రసాము, అగ్గిబరాటాలతో యువకులు చేసే విన్యాసాలు చూపరులను గగుర్పాటుకు గురిచేస్తాయి.



పోటాపోటీగా వాహనాల ముస్తాబు...

భేతాళస్వామి ఉత్సవంలో 13 వాహనాలు పాల్గొంటాయి. వీటిని వివిధ రకాల ఫల, పుష్పాలు, విద్యుద్దీపాలతో పోటాపోటీగా ముస్తాబు చేస్తున్నారు. శ్రీనివాసనగర్, పెచ్చెట్టివారి పాలేల నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామనగర్ నుంచి దుర్గమ్మవారు, దొమ్మేటివారిపాలెం (పాత పోస్టాఫీసు) నుంచి శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి వద్ద దొమ్మేటివారిపాలెం, పోతాయిలంక నుంచి ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి విజయగణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుండి షిర్డి సాయిబాబా, గుత్తుల వారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజరాజేశ్వరీదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు కొలువుదీరనున్నాయి.





అధునాతన టెక్నాలజీతో బందోబస్తు

సీఐ భీమరాజు



ఉత్సవంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో అధునాతన టెక్నాలజీతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. సీఐ, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

స్వచ్ఛ అవార్డులు

పంచాయతీ విభాగంలో లొల్ల... రెసిడెన్షియల్ విభాగంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్



సీఎం చంద్రబాబు నుంచి అవార్డును అందుకుంటున్న లొల్ల సర్పంచ్ జగన్నాథం

ఆత్రేయపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో పారిశుధ్య నివారణలో లొల్ల గ్రామం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబుచేతులు మీదుగా లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి కృష్ణామాచార్యులు స్వచ్ఛ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న సర్పంచ్ జగన్నాథంను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌తో పాటు కూటమి నాయకులు అభినందించారు.

ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్..

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ ఆశ్రమ స్కూల్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) ప్రిన్సిపాల్ సీహెచ్ఎంజీ పరిమళకు స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ (స్టేట్) అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం చేశారు. సోమవారం రాత్రి విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో స్వచ్ఛ అవార్డును బహూకరించారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణ ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించినందుకు రాష్ట్రస్థాయిలో రెసిడెన్సియల్‌స్కూల్స్ విభాగంలో అవార్డు వచ్చింది.



స్వచ్ఛ బస్టాండ్ కేటగిరీలో అవార్డు స్వీకరిస్తున్న వైవీఎస్ఎన్ మూర్తి



ఎంఎస్ఎంఈ కేటగిరిలో ఎలైట్ ఇన్‌స్ట్రూమెంట్ సంస్థ



స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు స్వీకరిస్తున్న అదనపు కమిషన్ రామలింగేశ్వర్



రెసిడెన్షియల్ కేటగిరీలో అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ పరిమళ

అందరికీ తాగునీటి భద్రత ప్రభుత్వ లక్ష్యం

ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న ఇషాన్‌బాషా

సామర్లకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి పథకాలు రానున్న మూడేళ్లలో పూర్తి చేసుకోవాలని గ్రామీణ నీటిపారుదల విభాగం చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలందరికీ తాగునీటి భద్రత కల్పించాలన్న ప్రధానోద్దేశ్యంతో గ్రామ, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. నీటిపా రుదల విభాగం ఏఈఈలు,డిప్యూటీ ఎంపీడీవోల తొలి బ్యాచ్ శిక్షణా తరగ తులను కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో బాషా సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రమాణాలు పాటించని ఆర్వో కేంద్రాల నీటి వినియోగం బాగా పెరిగిపోయిందని, దీని వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కేవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ మూడు రోజులకు ఒక బ్యాచ్ చొప్పున సబ్జెక్ట్ నిపుణులతో రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్ శిక్షణలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 40 మంది ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు. సోమవారం నుంచి ప్రారంభమైన శిక్షణాతరగతులకు ఉమ్మడి ఐదు జిల్లాల నుంచి 402 మంది హాజరయ్యేందుకు శిక్షణా తరగతులు ఏర్పాట్లు చేసినట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇవి పూర్తయ్యాక గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కూడా శిక్షణ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీన్, విశ్రాంత ఎస్ఈ ఉమాశంకర్, పెద్దాపురం డీఈ స్వామి, ఈఈశ్రీరామ్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నన్నయలో మెగా ఫుడ్ ఫెస్టివల్

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్‌.ప్రసన్నశ్రీ తెలిపారు. సోమవారం వర్సిటీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో యూనివర్శిటీ కాలేజీలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగ అధ్యాపకులతో ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమై చక్కని రుచులు, అభిరుచులకు వేదికైన గోదావరి జిల్లాల ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేలా ఈ ప్రాంత ప్రజల వంటకాల మాధుర్యాన్ని, గొప్ప తనాన్ని ఇనుమడింపజేయడానికి గానూ ఈ నెల 14, 15,16 తేదీల్లో మెగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి సిబ్బంది, విద్యార్థుల కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ దీనిలో భాగస్వామ్యం కావచ్చున్నారు. మెగా ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించి 14న క్విజ్, డిబేట్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహిస్తామన్నారు. 15,16 తేదీల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ వర్శిటీ పరిధిలోని ఆసక్తి కలిగిన వారంతా వంటలు సిద్ధం చేసుకుని యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చన్నారు. విభిన్న రుచులతో ఆరోగ్యకరమైన, సంప్రదాయ వంటలను ప్రదర్శించిన వారికి 16న బహుమతులు ప్రదానం చేస్తామని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయ నిర్మల, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కళ్యాణి, అధ్యాపకులు ఎం.కృష్ణవేణి, కె.సింధుజ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపికలు



సెలక్షన్స్‌లో ఎంపికైన జిల్లా కరాటే జట్టుతో అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి బాలురు, బాలికల సెలక్షన్స్ పూర్తయ్యాయి. సోమవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఫుట్‌బాల్, కరాటే పోటీలకు సంబంధించిన ఎంపికలు చేపట్టారు. ఈ సెలక్షన్స్‌ను రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జోన్-2 జాన్సన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జిల్లా టీం, స్టేట్ పోటీల్లో సత్తా చాటి మెడల్స్ తీసుకురావాలని కోరారు.ఎంపికలను డీఈవో కార్యాలయం ఏడీ వెంకట్రాజు, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు ఏవీడీ ప్రసాదరావు, భువనేశ్వరి, తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు పర్యవేక్షించారు.

నెట్‌బాల్ పోటీలకు ముగ్గురు..

ఆత్రేయపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రే యపురం మండలం ర్యాలి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆత్రేయపురంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. సీనియర్ విభాగంలో భవ్యరేఖ, రమాదేవి జూనియర్ విభాగంలో సుస్మిత ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎన్.సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వ్యాయామోపాధ్యాయులు నాగబాబు, సుబ్బారావు, పాఠశాల చైర్మన్ సీహెచ్ దుర్గారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్-17కు ఇద్దరు..

బిక్కవోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-17 సైక్లింగ్, మోడరన్ పెంటథలాన్ పోటీలకు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఇమ్మంది సత్యహరిని, దేవాది అలేఖ్య ఎంపికయ్యారని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, వారికి తర్ఫీదునిచ్చిన పీడీ డి.యువరాజారెడ్డిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

రెజ్లింగ్‌కు ఇద్దరు..

రాజోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-17 విభాగం నుంచి మట్టపర్తి బాలవంశీ, అండర్-14 విభాగం నుంచి అప్పారి ఓంసాయిచరణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎన్.శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపిక

అమలాపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె.కుమార్‌చందు శ్రీధర్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపికైనట్టు హెచ్‌ఎం కాశి ఘనసత్యనారాయణ తెలిపారు. శ్రీధర్ వెయ్యి మీటర్ల పోటీల్లో స్వర్ణం, 3వేల మీటర్ల పోటీలో కాంస్య పతకం సాధించాడు. శ్రీధర్‌ను డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అభినందించారు.



శ్రీధర్‌ను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా







రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ 1.48 కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,48,77,775 నగదు, 62గ్రాముల బంగారం, 345 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్‌ఏకు చెందిన 76 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, యుఏఈ 20 దిరహమ్స్ లభించాయి. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా దేవస్థానం సిబ్బంది, సేవాసంస్థల సభ్యులు లెక్కించారు. 35 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.25 లక్షలు భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్నారు.

గుడ్ ఈవినింగ్ క్లిక్..



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరిపై రోడ్డు కం రైల్వే బ్రిడ్జి ఎప్పటికప్పుడు ప్రత్యేకంగానే కనిపిస్తుంది. సోమవారం సూర్యాస్తమయం సందర్భంగా కనిపించిన అందమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

సినిమా చూసి వస్తుండగా విషాదం

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



మరణించిన కుశరాజు

గొల్లప్రోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఈబీసీ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్.జగ్గంపేట గ్రామానికి చెందిన గెడ్డం లోవకుమార్ శంఖవరం గ్రామానికి చెందిన బంధువు పడాల కుశరాజు (26)తో కలిసి మోటార్‌సైకిల్‌పై ఆదివారం రాత్రి పిఠాపురంలో సినిమా చూసేందుకు వెళ్లారు. సినిమా చూసి తిరిగి వస్తుండగా గొల్లప్రోలు వద్దకు వచ్చేసరికి అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా కుశరాజు మరణించాడు. తీవ్రంగా గాయపడిన లోవకుమార్ చికిత్స పొందుతున్నాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లెట్‌పై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన కామరాజు

కరప, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప నక్కావారిపేటలో బుల్లెట్‌పై నుంచి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం తుమ్మలపల్లికి చెందిన ఉల్లం కామరాజు కరపలోని బంధువుల ఫంక్షన్ వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. స్థానిక నక్కావారి ఎస్సీపేటలో శిథిలస్థితిలో ఉన్న వంతెనను దాటుతూ అదుపుతప్పి కిందపడిపోయాడు. కామరాజు ముఖానికి తీవ్ర రక్తపు గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని 108 అంబులెన్స్‌పై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కరప పోలీసులు విచారణ చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

గండేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామ శివారులో పెట్రోల్ బంక్ ఎదురుగా సోమవారం రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కె.సాయి అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో అతడి తల, చేతులకు గాయాలయ్యాయి. సాయి ఏలేశ్వరానికి చెందిన వ్యక్తిగా తెలుస్తుంది. స్థానిక పోలీసులు చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌పై రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తప్పిన ప్రమాదం

హైవే డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగిన ఆటో

గండేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై సోమవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో వెనుక టైర్ పంచర్ కావడంతో డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగింది. ఆటో డ్రైవర్ చాకచక్యంగా ఆపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆటో బోల్తా కొడితే పెద్ద ప్రమాదం జరిగేదని వారు భయపడ్డారు.



గండేపల్లి హైవేపై ఆగిన ఆటో

నాన్న... మాకు దిక్కెవరూ!

తాండవ నదిలో పడి పశువుల కాపరి మృతి

అనాథలైన ఇద్దరు చిన్నారులు



ఫైల్‌ఫొటో

తుని రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలో మునిగి పశువుల కాపరి మృతిచెందాడు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. తుని రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరి లోవ గ్రామానికి చెందిన మండల భీమరాజు (35) పశువులను మేపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే సోమవారం తాండవ నది తీరాన పశువులు మేపుతూ ఆటు గట్టు వైపు నుంచి ఇటు గట్టుకు పశువులను తరుముతున్న క్రమంలో తాండవ నదిలో నీట మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసినట్టు రూరల్ ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఆయన చెప్పారు.



భీమరాజు మృతదేహం

ఏడాది కిత్రమే భార్య మృతి...

భీమరాజు భార్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. ఇద్దరు ఆడపిల్లలను సాకుతూ పశువులే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తున్న భీమరాజు మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. పశువులను తీసుకెళ్లిన తండ్రి విగతజీవిగామారడంతో కన్నీరుమున్నీరయ్యారు.



బాధలో ఇద్దరు చిన్నారులు

దారిలో దంపతులను మింగిన మృత్యువు

కారు ఢీకొని భార్యాభర్తల మృతి

కోటపాడు ఏడీబీ రోడ్డులో ఘటన

రంగంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను కారు బలంగా ఢీకొనడంతో దంపతులు మృతిచెందిన సంఘటన సోమవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం కోటపాడు ఏడీబీ రోడ్డు శ్రీరామ్‌ఫామ్స్ వద్ద జరిగింది. ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణానికి చెందిన కర్రి గణేష్(45) వాలుతిమ్మాపురం లలిత రైస్‌మిల్లులో గోనెసంచులు కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడి భార్య కర్రి వీరలక్ష్మి(40) రంగంపేట మండలం కోటపాడులోని బీరు ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. వీరలక్ష్మిని బీరు ఫ్యాక్టరీ వద్ద దించేందుకు సోమవారం ఉదయం 7.30 గంటలకు గణేష్ మోటార్‌సైకిల్‌పై సామర్లకోట నుంచి వెళ్తుండగా కోటపాడు ఏడీబీ రోడ్డులో శ్రీరామ్ ఫామ్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రంగంపేట వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన భార్యాభర్తలను స్థానికులు 108 అంబులెన్స్‌లో పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఇద్దరూ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



మృతిచెందిన దంపతులు గణేష్, వీరలక్ష్మి

వ్యాపారి హత్య

ఆలస్యంగా వెలుగులోకి ఘటన



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏలేశ్వరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం డి.కొత్తూరు గ్రామానికి చెందిన అపరాల వ్యాపారి బొది రెడ్డి వెంకటేశ్వర్లు (69) హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లకు భార్య సత్యవతి, కుమారుడు ఆంజనేయులు ఉన్నారు. కుమారుడు ఏలేశ్వరంలో నివాసం ఉంటున్నాడు. విజయ దశమి పండుగ నేపథ్యంలో ఈనెల 2న వెంకటేశ్వర్ల దంపతులు కొడుకు వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో కారులో వచ్చిన ఓ వ్యక్తి వెంకటేశ్వర్లను బయటకు తీసుకెళ్లాడు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, వెంకటేశ్వర్లు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కంగారు పడిన కుటుంబసభ్యులు ఏలేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం రాత్రి అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బుదరాట అటవీప్రాంతం లో మృతదేహం ఉందని అక్కడి పోలీసులు ఏలేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు సంఘటనా స్థలానికి వెళ్లి ఆ మృతదేహం వెంకటేశ్వర్లుగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. తర్వాత వారు వెళ్లి నిర్ధారించారు. దాంతో ఏలేశ్వరం పోలీసులు అదృశ్యం కేసును హత్యకేసుగా మార్పు చేశారు. విచారణ తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. అయితే వెంకటేశ్వర్లును ఏలేశ్వరం గొల్లలమెట్టకు చెందిన రాజా రమేష్ హత్య చేశాడని వెంకటేశ్వర్లు కొడుకు ఆంజనేయులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన తండ్రికి వ్యాపారం నిమిత్తం ఎవరితోనూ విభేధాలు లేవని, కేవలం తన వంటిమీద ఉన్న రూ.10లక్షల విలువ చేసే బంగారం, ధనం కోసం మాత్రమే హత్య చేసి ఉంటాడని పోలీసులకు చెప్పాడు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న రాజా రమేష్ అడ్డతీగల మండల పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది.

ఆటో డ్రైవర్, ప్రయాణికులపై దాడి

కేసు నమోదు

రాయవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌తోపాటు ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తించి పలువురు వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని వెదురుపాక సావరం గ్రామానికి చెందిన అనసూరి శ్రీను, అన్నపూర్ణేశ్వరి దంపతులు హైదరాబాదులో పనిచేసుకుని జీవిస్తున్నారు. వారికి చింతపల్లి సత్యసాయి ప్రసన్న, కీర్తన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయి ప్రసన్నను వెదురుపాక సావరం గ్రామంలోని వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం సాయిప్రసన్న ఐదునెలల బాలింత. ఆమెతో పాటు చంటిబిడ్డను వి.సావరంలోని అత్తవారింటి వద్ద అప్పగించడానికి ఈనెల 5న హైదరాబాదులో బయలుదేరారు. సోమవారం వేకువజామున మాచవరం సెంటర్‌లో బస్సు దిగారు. అక్కడ నుంచి వి.సావరం చేరుకునుందుకు అదే గ్రామానికి చెందిన వాసంశెట్టి రామకృష్ణ ఆటోను మాట్లాడుకున్నారు. మాచవరంలో బస్సు దిగి ఆటో కోసం అనసూరి కీర్తన, సాయిప్రసన్న వేచిచూస్తుండగా తమ కారు ఎక్కాలని, తనపేరు వంశీ అటూ ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి ఇబ్బంది పెట్టాడు. ఈ లోపు ఆటో డ్రైవరు వారి వద్దకు చేరుకుని శ్రీను అతడి కుటుంబసభ్యులను ఆటో ఎక్కించుకుని బయలుదేరాడు. సోమేశ్వరం శివాలయం వద్దకు వచ్చేసరికి వంశీ మరికొందరు వ్యక్తులు కారులో వచ్చి ఆటో డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణపై దాడి చేశాడు. ఆటోలో ఉన్న అన్నపూర్ణేశ్వరి అడ్డుకోగా ఆమెపై దాడికి పాల్పడి ఆమె భర్త శ్రీనుపై దాడి చేసినట్టు బాధితులు తెలిపారు. ఆ వ్యక్తులు తమను పక్కకు నెట్టి వేశారని ప్రసన్న, కీర్తన ఆవేదన వ్యక్తం చేశారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో రాయవరం హెచ్‌సీపీ వీర్రాజు కేసు నమోదు చేశారు.



రాయవరంలో సంఘటన వివరాలు తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కారులో వచ్చి కొట్టుకెళ్లారు!

అమలాపురంలో వరుస దొంగతనాలు

ఆధారాలు సేకరించిన క్లూస్‌టీమ్

అమలాపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో ఆదివారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. కారులో వచ్చి మరీ దొంగలు పడ్డ ఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పట్టణ సీఐ పి.వీరబాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిని ఆనుకుని ఎర్రవంతెన సమీపంలోని కొల్లూరి బిల్డింగ్ మార్ట్, ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని పవన్ మారుతీ కేర్‌లలో దొంగలు పడ్డారు. ఆయా షాపుల యజమానులు జయన గణేష్, కొల్లూరి గుప్తా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. షాపుల తాళాలు పెకిలించడం, గోడలు పగులకొట్టి మరీ చోరీలకు పాల్పడడం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కారులో వచ్చి మరీ యువకులే ఈ చోరీలకు పాల్పడినట్టు భావిస్తున్నారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. కొంతమేర నగదుతో పాటు విలువైన వస్తువులను అపహరించుకుపోయినట్టు యజమానులు చెప్పారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

గోపాలపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగతనం కేసుకు సంబంధించిన ఇద్దరికి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించినట్టు ఎస్‌ఐ టీ.మనోహర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పీ.శివసుబ్రహ్మణ్యం, మరపట్ల రాజ్‌కుమార్‌పై డీలక్స్ మోటార్ సైకిల్ దొంగతనం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కోర్టులో వారికి రిమాండ్ విధించారన్నారు. దీనిపై చార్జ్‌షీట్ వేయగా కొవ్వూరు రెండో అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి న్యాయమూర్తి కే.నాగలక్ష్మి ఒక్కొక్కరికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ డీ.బాబూరావు వాదాన విపించగా, కోర్టు కానిస్టేబుల్ ఎస్.భాను ప్రాసిక్యూషన్‌కు సహకరించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఓట్ల చోరీతోనే బీజేపీకి అధికారం

ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం



కాకినాడలో మీడియాతో మాట్లాడుతున్న జేడీ శీలం

కాకినాడ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత మూడు దఫాలుగా ఓట్ల చోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీకి ఎన్నికల కమిషన్ కొమ్ము కాస్తోందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం ధ్వజమెత్తారు. సోమవారం ఆయన కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఆగడాలు ఇంకెంతో కాలం సాగవన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీపై నిగ్గు తేల్చాలని రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు 5కోట్ల సంతకాల సేకరణ చేపట్టామన్నారు. త్వరలోనే ఈ సంతకాల మెమోరాండాన్ని రాష్ట్రపతి, ఎలక్షన్ కమిషన్‌కు సమర్పిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజల ఓటు హక్కును దోచుకుంటోందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పళ్లంరాజు, ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పాలక్‌వర్మ, కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు,సత్యానందరావు ఉన్నారు.

స్థలం లీజు విషయంలో మోసం చేశారు

నాకు ప్రాణహాని ఉంది : పిఠాపురం మహారాజా తనయుడు రామరత్నారావు

పిఠాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మహారాజా కోట స్థలం లీజు విషయంలో ప్రముఖ విద్యా సంస్థల అధినేత తనను మోసం చేశారని, ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందని మహారాజా తనయుడు రాజా రావు రామరత్నారావు తెలిపారు. మంగళవారం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తాను కోటకు చెందిన 2 ఎకరాలను కేవలం మూడేళ్లకు మాత్రమే లీజుకి ఇచ్చానని తెలిపారు. తనను మోసగించి దానిని 30 సంవత్సరాలుగా మార్పు చేయడంతో పాటు స్థలాన్ని నాలుగు ఎకరాలకు పెంచి తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై తాను గతంలోనే పిఠాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయినా పోలీసులు స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు చెప్పారు. మహారాజా వారసుడిగా తనకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తున్నా అధికారులు స్పందింట్లేదన్నారు. ఈలోగా విద్యాసంస్థల అధినేత అనుచరులు కొందరు తనను హత మార్చేందుకు కుట్ర చేస్తున్నారని, తనకు ప్రాణరక్షణకల్పించాలని ఆయన కోరారు.

దాడి కేసులో ముగ్గురి నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుల మధ్య తలెత్తిన వ్యాపారా విభేదాలతో చాకుతో దాడి చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు సర్పవరం ఎస్‌ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో భావనారాయణ స్వామి ముఖద్వారం వద్ద బాలాజీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, కృపా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తు న్నారు. ఈ రెండింటి మధ్య వ్యాపారాల లావాదేవీల నడుమ ఆగస్టులో ఇరు వర్గాల మధ్య తగాదా జరగడంతో రెండు పక్షాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 4వ అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడం, పితాని నవీన్ కుమార్‌పై తుట్టా వెంకట బాలాజీ ఉల్లిపాయలు కోసే చాకుతో దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేశామ న్నారు. నిందితుల కోసం గాలిస్తూ సోమవారం ఉదయం బాలాజీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని తెలిపారు.

శ్రీ సంస్థానం భూములకు కౌలు వేలం పూర్తి

తొండంగి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగిలో ఉన్న పిఠాపురం శ్రీ సంస్థానం భూముల కౌలు వేలం పాటలు సోమవారం పూర్తయ్యాయి. ఉదయం ఆరు ప్రతులకు వేలం నిర్వహించారు. కౌలు రైతులు హైకోర్టుకు వెళ్లడంతో వేలం సాయంత్రం 5 గంటల్లోపు నిర్వహించాలన్న కోర్టు ఉత్తర్వులు 3గంటలకు అందడంతో మధ్యాహ్నం మిగిలిన ఆరుప్రతులకు వేలం పూర్తి చేశారు. 12 ప్రతులకు సంబంధించి 57.80 ఎకరాల్లో 11 ప్రతులకు 52.80 ఎకాలకు వేలం పూర్తయ్యింది. ఒక ప్రతికి చెందిన 5 ఎకరాలకు గత కౌలు కంటే తక్కువకు పాట వెళ్లడంతో దానిని వాయిదా వేశారు. వేలం పాటలు జరిగిన 11 ప్రతులకు సంబంధించి గత శిస్తు రూ.3,55,600 కాగా ప్రస్తుం అది రూ.6,08000కు చేరింది. గతం కంటే ఏడాదికి రూ.2,52,400 అదనంగా పెరిగింది. పర్యవేక్షణాధికారి బి.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఈవో శివబాబు, ఎం.భద్రరావు, డి.శ్రీనివాస్, రఘుబాబు, నాగబాబు పాల్గొన్నారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు కృష్ణమాచారి, జగన్మోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

హై ఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

మామిడికుదురు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హై ఓల్టేజీ కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవ కృష్ణశర్మ కాలనీలో సోమవారం పలు ఇళ్లల్లో గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు 30 ఇళ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు, ఫ్యాన్‌లు, ఇన్వర్టర్లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం తాము నిద్రలో ఉండగా ఈ ప్రమాదం జరిగిందని, తీవ్ర భయాందోళనకు లోనయ్యామని, పిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీసినట్టు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తిప్పలు తప్పవా?

సమస్యల వలయంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి

రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్) పరిస్థితి దారుణంగా తయారైంది. అడుగుపెట్టడంతోనే తిప్పలు ప్రారం భవుతున్నా యి. స్ట్రెచర్, వీల్ చైర్లు అందుబాటులో ఉండడం లేదు. స్ట్రెచర్ బేరర్ ఊసే లేకపోవడంతో రోగితో వచ్చిన సహాయ కులే తంటాలు పడాల్సి వస్తోంది. వీల్ చైర్లు అవసాన దశకు చేరి మొరాయిస్తుండ డంతో రోగులు కుంటు తూ, వేరొకరి సహాయంతో కష్టంగా వైద్యుడి వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఈ తిప్పలు అత్యవసర వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. వీల్‌చైర్లు, స్ట్రెచర్ల నిర్వ హణకు ఉద్యోగిని కేటాయించినా సొంత పనులకు సొంతమ య్యారు. ఆస్పత్రికి ఒక డిప్యూటీ కలెక్టర్‌ని ప్రత్యేక అధికారిని నియమించారు. వారానికి రెండుసార్లు ఆయన ఆస్పత్రికి రావాలి. రోగుల బాధలు వినాలి. కానీ ఏదైనా ఘటన జరిగినప్పుడే ఆయన అలికిడి కనిపిస్తుందనే విమర్శలు ఉన్నాయి. 2022 డిసెంబరు 21న వైద్య విద్య డైరెక్టర్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం అత్యవసర రోగులను రిసీవ్ చేసుకోడానికి ఆస్పత్రి ప్రవేశం/క్యాజువాలిటీ వద్ద రెండేసి చొప్పున స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, ఒక్కొక్కరు చొప్పున ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, డాక్టరును నిరంతరం అందుబాటులో ఉంచాలి. కానీ ఆదేశాలను కూడా నిర్వీర్యం చేశారు. ఈ తీరు ప్రభుత్వంపై జనాల ఆగ్రహానికి కారణమవుతోంది. ఇక దాతలు ఇస్తున్న స్ట్రెచర్లు, వీల్‌చైర్లు ఏమవు తున్నాయో తెలియదు. కొత్త కలెక్టర్ అయినా పెద్ద మనసుతో ఆస్పత్రిపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరిస్తారని రోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

-రాజమహేంద్రవరం, (ఆంధ్రజ్యోతి)



వీల్‌చైర్ కదలకపోవడంతో కుంటుకుంటూ ఇలా...



వాడకానికి దూరంగా మూలకు చేరిన వీల్ చైర్



స్ట్రెచర్‌పై అతి కష్టంపై రోగిని మార్చి తీసుకెళ్తున్న రోగి సహాయకులు



కాకినాడ

అతిథి అధ్యాపక పోస్టుకు నేడు ఇంటర్వ్యూ

పిఠాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపక పోస్టుకు మంగళవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి తెలిపారు. ఎంటెక్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

'పిటిషన్లు రీ ఓపెన్ కాకుండా చూడాలి'



మహిళ సమస్యను అడిగి తెలుసుకుంటున్న కమిషనరు భావన

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో నమోదైన పిటిషన్లు రీ ఓపెన్ కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనరు భావన అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పిటిషన్లను నిర్దిష్ట సమయానికి పరిష్కరించాలని, అలసత్వం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. 13 మంది అర్జీలు సమర్పించగా కమిషనరు వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేసి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనరు'కు ముగ్గురు ఫోను చేసి తమ సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనరు కేటీ సుధాకర్, ఎస్ఈ వెంకట్రావు, మేనేజరు సీతారాం, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, డీసీపీ కృష్ణారావు, అకౌంటెంట్ రామశాస్త్రి, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

'పాడా' పీజీఆర్ఎస్‌కు 36 అర్జీలు



పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావుకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేత మురళీధరరావు

పిఠాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి వివిధ అంశాలపై 36 అర్జీలు అందాయి. వీటిని సత్వరం పరిశీలించి సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో పాటు దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ స్వచ్ఛభారత్ విభాగం రాష్ట్ర సహ కన్వీనర్ బుర్రి మురళీధరరావు ఫిర్యాదు చేశారు. పలుచోట్ల డ్రైన్లల్లో పూడిక పేరుకుపోయిందని, ప్రధాన రహదారులపై ఉన్న చెత్తను కూడా తొలగించట్లేదన్నారు. పలు ప్రాంతాల్లో కల్వర్టులను ఎత్తుగా నిర్మించడంతో రహదారులపై వెళ్లే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. వీటిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీడీ వసంతమాధవి, మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గురుబ్రహ్మ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు

'గురుబ్రహ్మ' అవార్డుల ప్రదానోత్సవం

గొల్లప్రోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గొల్లప్రోలులోని అచ్యుతకృష్ణ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం గురుబ్రహ్మ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. మండల, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన 36మంది ఉపాధ్యాయులను ఎంపిక వారిని అవార్డులతో సత్కరించారు. పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు తన సొంత నిధులు రూ.25 లక్షలు వెచ్చించి వివిధ కార్యక్రమాలు నిర్వహించిన సాయిప్రియ సేవా సమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి శాస్త్రి, జిల్లా అధ్యక్షుడు శిష్టా చలపతి, జిల్లా కార్యదర్శి కె.నూకిరెడ్డి, ఎంఈవోలు వెన్నా శ్రీనివాసరావు, శివప్రసాద్, గొల్లప్రోలు మండల శాఖ అధ్యక్షుడు కేఎస్ఆర్ మూర్తి, కేవీ కృష్ణారెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు విద్యార్థుల వయోలిన్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ముఖ ద్వారాల నిర్మాణానికి శంకుస్థాపన



ముఖ ద్వారాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ ముందు భాగంలో ఉత్తర, దక్షిణాల వైపు రూ.29 లక్షలతో ముఖ ద్వారాల నిర్మాణానికి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి సోమవారం భూమి పూజ చేశారు. ది గోదావరి మర్చంట్స్ అసోసియేషన్ చైర్మన్ అయిన గ్రంధి బాబ్జీ ఆర్థిక సహకారం రూ.15 లక్షలతో ఒకటి, భక్తుల ఆర్థిక సహకారం రూ.14 లక్షలతో మరొకటి నిర్మించనున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కరప ఎంపీడీవో మృతి



ఎంపీడీపీవో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, సిబ్బంది

కరప, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కరప ఎంపీడీవో బులుసు కృష్ణగోపాల్ (61) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతంలో కరప మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయన అనంతర కాలంలో కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. పదోన్నతిపై ఇటీవలే కరప ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకుని అనారోగ్య సమస్యలతో వెంటనే సెలవుపై వెళ్లిపోయారు. కృష్ణగోపాల్ ఆకస్మిక మృతికి పలువురు అధికారులు సంతాపం తెలిపారు. కరప మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు, పరిపాలనాధికారి బీఎల్ నరసింహం, సిబ్బంది తలాటం సుబ్రహ్మణ్యం, కార్తీక్, రామలక్ష్మి, స్వామి, గోపి నివాళులర్పించారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాంబమూర్తినగర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వంద సంవత్సరాల ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విజయదశమి ఉత్సవాలను కూడా జరిపారు. కలెక్టర్ షాన్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ మాట్లాడుతూ 1925లో విజయదశమి నాడు ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ హిందూ సమాజం, ప్రపంచ శాంతి లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. డాక్టర్‌జీ దీని కోసం శాఖ కార్య పద్ధతి అందించారన్నారు. జిల్లా విభాగ్ ప్రచారక్ రామచంద్రరాజు, విజయ్‌ప్రకాశ్, జిల్లా ప్రచారక్ సోమశేఖర్, ఆదిత్యశర్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మామిడాల శ్రీనివాసు పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి: ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంతి అధ్యక్షతన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. చట్టం అమలు తీరుతో పాటు స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలపై చర్చించారు. డాక్టర్లు రాజేష్, జయేష్ తదితరులు పాల్గొన్నారు.

స్క్వాష్ పోటీలో 'భాష్యం' విద్యార్థి హరిన్యాయ్ ప్రతిభ

కాకినాడ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్క్వాష్ పోటీలో కాకినాడ శశికాంత్‌నగర్ భాష్యం విద్యార్థి వీఎస్ఎస్‌టీ హరిన్యాయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు జోనల్ ఇన్చార్జి వి.గోవిందరాజు తెలిపారు. క్రీడాకారుడిని భాష్యం విద్యా సంస్థల అధినేత బి.రామకృష్ణ, గోవిందరాజు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అభినందించారు.

నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులపై సమీక్ష

డీసీసీ సమావేశంలో పాల్గొన్న నేతలు జేడీ శీలం, డాక్టర్ పాలక్‌వర్మ, పళ్లంరాజు



కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, కాంగ్రెస్‌లో చేరిన సూరిబాబులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. జేడీ శీలం, డాక్టర్ పాలక్‌వర్మ, ఎంఎం పళ్లంరాజు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సమీక్షించారు. పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు మలకల సూరిబాబు పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో కలిసి పళ్లంరాజు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, పీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ కామన ప్రభాకరరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి నక్క సత్యనారాయణ, సభ్యులు కుక్కల పోతురాజు, పోలిశెట్టి శ్రీనివాసరావు, మేడిద శ్రీను, కాకినాడ సిటీ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల గాంధీరాజు, అధికార ప్రతినిధి మారోతి శివగణేష్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ మొయ్యేటి సూర్యప్రకాష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు గేలం శ్రీను, నీరుకొండ సత్యనారాయణ, పిల్లి సత్యలక్ష్మిచిన్న, జిల్లా ఉపాధ్యక్షులు దవులూరి ధనకోటి, పబ్బినీడి కృష్ణ, నాయకులు రాజారపు మహేష్, పాండ్రంకి రమణ, నవుడు గోవిందు, వనుం వెంకటరమణ, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. సాయంత్రం కల్పన సెంటర్లో వ్యాపారులు, ప్రజల నుంచి జేడీ శీలం, డాక్టర్ పాలక్‌వర్మ, ఎంఎం పళ్లంరాజు సంతకాలు సేకరించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబ్రహ్మదేవం ఎంపీటీసీ మలకల సూర్యారావు వైసీపీని వీడారు. కాకినాడలోని డీసీసీ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రులు ఎంఎం పళ్లంరాజు, జేడీ శీలం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో సూర్యారావు తన అనుచరులైన సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్యవేణి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, అన్నపూర్ణ ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస ప్రకాశరావులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. సూర్యారావును పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా నియమిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో ఆయన అసెంబ్లీకి పోటీ చేసేలా పార్టీని బలోపేతం చేయాలని పళ్లంరాజు కోరారు.

పత్తి పంట పొలాల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న గుంటూరు లామ్‌ఫామ్ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయాధికారులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు, దుర్గాడ, తాటిపర్తి గ్రామాల్లో గుంటూరు లామ్ ఫామ్, పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయాధికారులు సోమవారం పర్యటించారు. పత్తి పంటపై విజేరియం విల్ట్, ఆకుపచ్చ తెగులు, టొబాకో స్ట్రీక్ వైరస్ ఆశించడంతో మొక్కలు చనిపోతున్నట్టు గుర్తించారు. దీనివల్ల జరిగిన నష్టాన్ని కలెక్టర్ షాన్ మోహన్‌కు నివేదించారు. చనిపోతున్న మొక్కలతో పాటు రైతుల నుంచి సేకరించిన విత్తనాలను పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు. రెండు రోజుల్లో నివేదిక పంపుతామని శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా తమ అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా తెగుళ్లుగా ఎలా నిర్ధారించారని అధికారులను రైతులు నిలదీశారు. ఒకే రకం విత్తనాలు వేసిన మొక్కలు చనిపోతుంటే మిగిలిన విత్తనాలు వేసిన పంట బాగుందని తెలిపారు. పరిశీలనలో గుంటూరు లామ్ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రాజామణి (పత్తి), డాక్టర్ వీవీ మనోజ్‌కుమార్ (తెగుళ్ల విభాగం), డాక్టర్ రాజేష్‌చౌదరి (కీటక విభాగం), ఎ.సీతారామశర్మ (ఏరువాక కేంద్రం), జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, సహాయ సంచాలకురాలు పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, వీపీఏలు రాజా, ఉదయ్, రెడ్డి పాల్గొన్నారు.



నరసింహమూర్తిని అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చౌదరి

'అప్స' జిల్లా అధ్యక్షుడిగా నరసింహమూర్తి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) జిల్లా అధ్యక్షుడిగా రమణయ్యపేట మూర్తి హైస్కూలు కరస్పాండెంట్ పాలిక నరసింహమూర్తిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి విజయవాడలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా తోటకూర వెంకటేశ్వరరావుని ఎన్నుకున్నారు. 26 జిల్లాల కార్యవర్గ సభ్యులను రాష్ట్ర కమిటీ సత్కరించింది. ప్రైవేట్ స్కూల్సు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సభ్యులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామని నరసింహమూర్తి చెప్పారు.



మరిడమ్మ దేవస్థానంలో చండీ హోమం

పెద్దాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో సోమవారం చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల పవిత్ర మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు జరిపారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాము కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పెద్దాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన ఆత్మ మాజీ చైర్మన్ కలకపల్లి రాంబాబు (రాము) కుటుంబాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కొరుపూరి రాజు కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు.



కలెక్టర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఆయుష్ వైద్యాధికారి దివ్య

గురజనాపల్లి ఆయుష్ వైద్యశాలకు స్వచ్ఛ అవార్డు

కరప, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురజనాపల్లిలో గల ఆయుష్ వైద్యశాలకు స్వచ్ఛ హాస్పిటల్ విభాగంలో జిల్లా అవార్డు వచ్చినట్టు వైద్యాధికారి బి.దివ్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కాకినాడలో కలెక్టర్ షాన్‌మోహన్ నుంచి అవార్డు స్వీకరించినట్టు చెప్పారు. తమ సిబ్బంది, గ్రామస్తుల సమష్టి కృషి ఈ అవార్డు రావడానికి కారణమన్నారు. ప్రభుత్వం ఇటువంటి అవార్డులు అందివ్వడం విధి నిర్వహణకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. ఆసుపత్రి ఆవరణలో ఔషధ మొక్కలు పెంచుతున్నామని, త్వరలో పంచకర్మ చికిత్సలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

తమ ఆసుపత్రి ద్వారా కరప, కాజులూరు మండలాలకు చెందిన ప్రజానీకానికి ఆయుష్ సేవలు అందుతున్నాయన్నారు. ప్రతిరోజూ ఉదయం వైద్యశాలలో, స్థానిక హైస్కూల్‌లో యోగా ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. వచ్చే ఏడాది రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయుష్ కాకినాడ జిల్లా వైద్యాధికారి షాజాద్ ఆలీ, సిబ్బంది ఎన్ఎస్ కృష్ణమూర్తి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

కాకినాడ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 31లోగా దరఖాస్తుచేసుకుని, పరీక్ష రుసుమును ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లించవచ్చని డీఈవో పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని సంబంధిత స్టడీ సెంటర్ నుంచి ఉచితంగా పొంది వివరాలను పూరించి సమన్వయకర్త ద్వారా తప్పులు ఏమైనా ఉంటే సరిచేయించుకుని ఏపీ ఆన్‌లైన్ కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు జెరాక్స్ కాపీని, ఫీజు చెల్లించిన రశీదును ఏ-1 కేంద్రానికి ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు 30 రోజులు విధిగా తరగతులకు హాజరుకావాలని, స్టడీ సెంటర్లో ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఇతర వివరాలకు ఏ-1 కేంద్రాలను, ఓపెన్ స్కూల్ కాకినాడ జిల్లా సమన్వయకర్త పి.సాయివెంకటరమణను 8977645704 నెంబర్లో సంప్రదించాలని డీఈవో కోరారు.

రోడ్డు నిర్మాణం కోరుతూ సీపీఎం నాయకుల ఆందోళన

కాజులూరు (కరప), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పూర్తిగా శిథిలమైన గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం చేదువాడ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్, మండల కన్వీనర్ వల్లు రాజబాబు మాట్లాడుతూ గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు, చేదువాడ పంట కాలువ వంతెన, కాజులూరు మురుగు కాలువ వంతెన పూర్తిగా శిథిలమై ప్రజలు ఏళ్ల తరబడి నానా అవస్థలు పడుతున్నారన్నారు. గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డుకు నిధులు మంజూరై ప్రారంభించిన పనులను అర్ధంతరంగా నిలిపివేశారని, గోతులతో అధ్వానంగా ఉన్న రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిందన్నారు.

ఆందోళనలో సర్పంచ్ గంజా సూరిబాబు, మాజీ సర్పంచ్ పెంకే సూర్యనారాయణ, కురుపూడి భూచక్రం, గంజా అప్పారావు, దంగేటి శ్రీనివాసులు, పిల్లి నాగేశ్వరరావు, గంజా కామేశ్వరి, సుబ్బలక్ష్మి, సత్యవతి, నాగమణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'శ్రీప్రకాష్' విద్యార్థుల విదేశీ సాంస్కృతిక పర్యటన

కాకినాడ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థుల కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ సాంస్కృతిక పర్యటన విజయవంతంగా ముగిసిందని డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. తమ విద్యార్థులు విదేశాల్లో కింగ్‌లియర్, జూలియస్ సీజర్ వంటి క్లాసికల్ నాటకాలను అత్యున్నత స్థాయిలో ప్రదర్శించి శుక్రవారం స్వదేశానికి చేరుకున్నారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై చూపిన ప్రతిభ దేశానికి ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ పర్యటన ఆవిద్యార్థుల జీవితాల్లో ఒక స్ఫూర్తిదాయకమైన మైలురాయి అవుతుందన్నారు. స్వదేశానికి చేరుకున్న విద్యార్థుల బృందాన్ని పాఠశాల యాజమాన్యం, డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు (కరప), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాజులూరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కాజులూరు వరకు కొత్త విద్యుత్ లైన్‌ల నిర్మాణం, ఇతర నిర్వహణ పనులు నిర్వహిస్తామన్నారు. అయితపూడి, తిప్పరాజుపాలెం, కాజులూరు, శివారు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వీర్రెడ్డి చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కాజులూరు (కరప), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం బోధించేందుకు అవసరమైన గెస్ట్ లెక్చరర్ పోస్టు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో కనీసం 50శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అతిథి అధ్యాపకుడు పనిచేసే కాలానికి ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి వేతనం చెల్లిస్తామని ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్‌లో ప్రొవిజనల్ జాబితా

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సు చదివేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను ఆర్ఎంసీ కాకినాడ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ సోమవారం తెలిపారు. అభ్యంతరాలుంటే గతంలో సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించని వారు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ఆర్ఎంసీ కార్యాలయంలో అందించాలని కోరారు. మరిన్ని వివరాలకు వైబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యులకు సత్కారం

కాకినాడ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో శ్రీవాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కమిటీ సభ్యులను శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి సంక్షేమ భక్త సంఘం ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి వీరభద్రరావు (బుజ్జి) మీడియాతో మాట్లాడుతూ 130 సంవత్సరాల చరిత్ర గల ఈ ఆలయంలో ప్రతిఏటా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గ్రంధి నారాయణరావు, బోడ త్రినాథరావు, మండవిల్లి వేణుగోపాల్, గొల్లపూడి సుబ్రహ్మణ్యం, మండ రాజేష్, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ

పిఠాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో సంగమేశ్వర సంగీత సమాఖ్య, సంస్కార భారతి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి, శంకరాచార్యుల ఆరాధనలను పురస్కరించుకుని సోమవారం రాత్రి సంగీతోత్సవం నిర్వహించారు. విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. ఆయన తోడి వర్ణంతో ప్రారంభించి వినాయక నిను వినా, మరుగేలరా ఓ రాఘవా తదితర కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై హరిప్రసాద్, మృదంగంపై శ్రీనివాసశర్మ, కంజీరపై వెంటూరి పరశురాం సహకారం అందించారు. తొలుత సంస్కారభారతి ప్రతినిధులు శేఖర్, సాయిలక్ష్మి, ఆకొండి శ్రీనివాసరాజారావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.



లలితాదేవికి విశేష పూజలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలోని పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి చెంతన కొలువైయున్న లలితాదేవికి పౌర్ణమి సందర్భంగా అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఏకాదశ రుద్రాభిషేకం, మహిళలతో సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన జరిగాయి. ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మందుగుండు సామగ్రి సీజ్

కరప, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కరపలో అక్రమంగా నిల్వ చేసిన మందుగుండు సామగ్రిని సీజ్ చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. స్థానికంగా పాన్‌షాపు నిర్వహిస్తున్న పెంకే ప్రసాద్ గత ఏడాది టెంపరరీ లైసెన్స్ తీసుకుని క్రాకర్స్ విక్రయించాడని, మిగిలిన క్రాకర్స్‌ను ఇంట్లో నిల్వ చేశాడన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన తనిఖీల్లో అతని ఇంట్లో నిల్వ ఉంచిన రూ.16,500 విలువైన క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఎమ్మెల్యే పరామర్శ

ప్రత్తిపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాలుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఒమ్మంగికి చెందిన టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు రామిశెట్టి మురళిని సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. మరో సీనియర్ టీడీపీ నాయకుడు కొప్పన సీతయ్యను ఎమ్మెల్యే పరామర్శించారు. కూటమి నాయకులు కన్నబాబు, జింకల తాతారావు, ఇళ్ళ అప్పారావు, మంతెన శ్రీను, కొప్పన నాని, రామిశెట్టి మున్సిబ్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం తనిఖీ


ఉపాధ్యాయుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న పీవో నొక్వాల్

చింతూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చింతూరులోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని (టీచింగ్ ఎట్ ది రైట్ లెవల్) చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ సందర్శించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఏపీ సమగ్ర శిక్ష ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. సోమవారం నుంచి ఈనెల 11 వరకు తొలివిడత జరగనుంది. కార్యక్రమంలో 120 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రాన్ని పీవో సందర్శించి శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గది బోధనలో అనుసరించాలని పీవో సూచించారు. ఈ ఏడాది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని, ఆ మేరకు ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని పీవో పేర్కొన్నారు. అదే దశలో శిక్షణ ఏ స్థాయిలో ఉపయోగపడనుందని ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో 1, 2, క్లస్టర్ ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలను ఆదుకోండి


పీవోకు వినతిపత్రమిస్తున్న బీజేపీ నేతలు

చింతూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చింతూరు డివిజనులో వచ్చిన వరదల నేపథ్యంలో లోతట్టు వాసులు నష్టపోయారని, దీనిలో భాగంగా ఆయా కుటుంబాలను ఆదుకోవాలని బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య, మాజీ మండలాధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి కోరారు. ఈ మేరకు వారిద్దరు కలిసి ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రూ. మూడువేలు వంతున పరిహారం, బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేయాలన్నారు. అలాగే పంట నష్టంపై సర్వే చేయించి రైతులందరికీ పరిహారం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్తయ్య, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కాలువపై తక్షణమే బ్రిడ్జి నిర్మించాలి


ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

దేవీపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలగపల్లి, గుంపెన్నపల్లి మధ్యలో ఉన్న సీతాపల్లి పెద్ద కాలువపై తక్షణమే బ్రిడ్జి నిర్మించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో బి.స్మరణ్ రాజ్‌కి వినతిపత్రం ఇచ్చామని లక్ష్మీపురం గ్రామస్థులు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. గ్రామస్థులు ఇరప పండు, మాజీ సర్పంచ్ కోసు లచ్చన్నదొర మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మించకపోవడంతో సుమారు పదివేల మంది ప్రజలు దేవీపట్నం మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లాలంటే సుమారు 78 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోందన్నారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మంచడంతో గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు వాగు దాటాలంటే ప్రాణాలను పణంగా పెట్టాల్సి ఉందన్నారు.

పంచాయతీ కార్యదర్శికి అవార్డు


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న మోహన్

మోతుగూడెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించినందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి గుంపెనపల్లి మోహన్ ఉత్తమ పంచాయతీ సెక్రటరీ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పాడేరులో సోమవారం ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న మోహన్‌ను సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ సిబ్బంది, చింతూరు మండల ప్రజలు, స్థానిక ఎంపీడీవో, సహచర ఉద్యోగులు అభినందించారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 63 అర్జీలు

రంపచోడవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిణి ఎం.సావిత్రి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ప్రజల నుంచి 63 అర్జీలు అందాయన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, డీప్యూటీ డైరెక్టర్ షరీఫ్, సబ్ డీఎఫ్‌వో అనూష, పీహెచ్‌వో దేవదానం, ఏపీడీ శ్రీనివాస్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికుల ఈకేవైసీ పూర్తిచేయాలి

రంపచోడవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లు నిరోధించేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని తీసుకువచ్చిందని, శ్రామికులందరినీ తప్పనిసరిగా అనుసంధానం చేస్తున్నామని ఏపీడీ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. సోమవారం రంపచోడవరం పంచాయతీ సిరిగిందలపాడులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి శ్రామికులతో మాట్లాడారు. రంపచోడవరం క్లస్టరులో 15,800 మంది ఉపాధి కూలీలు ఉన్నారని, గత నాలుగు రోజులుగా 7,800 మందిని ఈకేవైపీ పరిధిలోకి తీసుకువచ్చామన్నారు. సోమవారం నాటికి నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జి.శ్రీనివాస్, జేఈ బి.ఎడ్విన్, సాంకేతిక సహాయకులు విధుషిమణి, వి.వీరన్న పాల్గొన్నారు.

సిగ్నల్స్ లేక మొరాయిస్తున్న ఈ - పోస్ మిషన్లు

● గంటల కొద్దీ లబ్ధిదారుల ఎదురుచూపు

ఎటపాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ (ఈ-పోస్ మిషన్లు) ద్వారా చౌక బియ్యం పంపిణీలో సిగ్నల్స్ సమస్య తలెత్తుతోంది. దీంతో గ్రామాల్లో గత ఐదారు రోజులుగా బియ్యం పంపిణీ అరకొరగా సాగుతోంది. ఈక్రమంలో లబ్ధిదారులు రేషన్ షాపులు, సిగ్నల్స్ వచ్చే ప్రాంతాల వద్ద గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నారు. ఈనెల నుంచి ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే మిషన్లలో సిగ్నల్స్ కోసం డీలర్లు ప్రైవేట్ జియో సిమ్‌కార్డులు వినియోగిస్తున్నారు. మారుమూల ప్రాంతాలైన విస్సాపురం, చలంపాలెం,మాధవరావుపేట, బాసవాగు, తదితర గ్రామాల్లో సిగ్నల్స్ అందకపోవడంతో పంపణీలో జాప్యం జరుగుతోంది. ఈ విషయమై తహశీల్దార్ కార సుబ్బారావును వివరణ కోరగా సిగ్నల్స్ ఉన్న సిమ్ కార్డులు డీలర్లు పెట్టుకోవాలని సూచించామని చెప్పారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి

రంపచోడవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ద్వారా వివిధ రకాల వస్తువులపై తగ్గిన ధరలపై ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా తెలుసుకొనే విధంగా అవగాహన కల్పించే బాధ్యత అందిరిపై ఉందని ఐటీడీ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇస్తున్న సూపర్ జీఎస్టీ, టీచింగ్ ఎట్ టాలెంట్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యూవోలు కృష్ణమోహన్, రామతులసి, సుజాత, ఎంఈవోలు బాపన్నదొర, ఎంపీపీ సత్యనారాయణ, సూరారెడ్డి, అబ్బాయిదొర, డీఆర్పీలు, సీఆర్‌టీలు, రిసోర్స్ పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, డీడీ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ప్రయోజనం

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


ఒమ్మంగిలో జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సడలింపుతో ప్రతి కుటుంబానికి ఎంతోకొంత ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. ఒమ్మంగిలో సోమవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి దుకాణం, ఇంటింటికి వెళ్లి జీఎస్టీ అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ సడలింపు విధానంతో పేద కుటుంబాల్లో రోజువారి ఖర్చులు 10నుంచి 20శాతం తగ్గాయని, మధ్యతరగతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం లభిస్తుందన్నారు. ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని, విజన్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ఈజీఎస్టీ సంస్కరణలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర సోమరాజు, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు, ఒమ్మంగి సొసైటీ అధ్యక్షుడు సత్యంశెట్టి సీతారాం, కార్యదర్శి నాగమహేష్, కూటమి నాయకులు మంతెన శ్రీను, గొంతిన సురేష్, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు వెంకటేశ్వరరావు, పోలిశెట్టి శ్రీనివాస్, అడ్డాల త్రిమూర్తులు, బత్తుల భాస్కర్, సుంకర భవాని పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం


పేదలకు భోజనం వడ్డిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్‌లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్నక్యాంటీన్‌లో సోమవారం మల్లిసాల గ్రామానికి చెందిన ముందు అప్పారావు మంగయ్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ముంద్రు కృష్ణారావు (ఎర్రబాబు), ముంద్రు జానకి రామారావు ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వీరబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ, తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, క్లస్టర్ ఇంచార్జి పైడిపాల సూరిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, తూము కుమార్, భూపాలపట్నం ప్రసాద్, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, రాయి సాయి, దాపర్తి సీతారామయ్య, వెలిశెట్టి శ్రీను, ముందు శ్రీనివాసరావు, సాయిరాం శ్రీను పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా చౌదరి



చౌదరిని సత్కరిస్తున్న దృశ్యం

గండేపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గండేపల్లికి చెందిన శ్రీగీతం స్కూల్ కరస్పాండెంట్ వీఎస్‌పీ చౌదరి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్య రాజు చౌదరిని ఘనంగా సత్కరించారు. చౌదరి మాట్లాడుతూ సంఘంలో ఏ సభ్యుడికి కష్టం వచ్చినా వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

బాణసంచా తయారీలో జాగ్రత్తలు పాటించండి


గండేపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


జగ్గంపేట: బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, సీఐ

గండేపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ కేంద్రంలో జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు, ఫైర్ ఎస్ఐ రత్నరాజు అన్నారు. సోమవారం గండేపల్లి గ్రామ శివారులో తయారు చేస్తున్న బాణసంచా కేంద్రాన్ని పరిశీలించారు. తయారీ కేంద్రం అనుమతి రికార్డులను పరిశీలించారు. బాల కార్మికులు బాణసంచా తయారీలో ఉండకూడదన్నారు. విద్యుత్‌ను వాడకూడదని, బాణసంచా కార్మికులకు ఇన్సూరెన్సులు చేయించడంతో పాటు నిబంధన ప్రకారమే స్టాకు ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తయారీ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పోలీసు, అగ్నిమాపక శాఖాధికారులు తనిఖీ చేశారు. తహశీల్దార్ జేవీఆర్ రమేష్‌బాబు, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, రెవెన్యూ పోలీస్ అధికారులు ఉన్నారు.

హిందూ సంప్రదాయాలను కాపాడేందుకు కృషి


కె.కొట్టాంలో శ్రీదుర్గాదేవి ఆలయంలో మాట్లాడుతున్న స్వామిజీ

కోటనందూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): భక్తులు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకునేందుకు కృషి చేయాలని తుని మండలం కుమ్మరిలోవ తపోవనంస్వామిజీ శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామి అన్నారు. సోమవారం కె.కొట్టాం గ్రామంలో శ్రీశ్రీశ్రీ విజయదుర్గ ఆలయ ప్రతిష్ఠలో స్వామిజీ మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను కాపాడేందుకు గ్రామాల్లో కృషి చేయాలన్నారు. ముందుగా గణపతి పూజ, మహాహోమం, కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు.

అతిథి అధ్యాపక పోస్టుకు నేడు ఇంటర్వ్యూ

పిఠాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పద్ధతిలో పనిచేసేందుకు కంప్యూటర్‌సైన్స్ లెక్చరర్ ఎంపిక కోసం మంగళవారం జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి కోరారు. ఎంటెక్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఎంసీఏలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం


రాచపల్లిలో హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని హోమియో వైద్యురాలు మంతెన లక్ష్మి వినీల వర్మ చెప్పారు. రాచపల్లి అరుణాచల ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని రమణాశ్రమ వ్యవస్థాపకుడు రమణానంద స్వామి ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. విశ్వ మానవతా సంస్థ ఫౌండర్ అల్లూరి శ్రీనివాస చౌదరి రాష్ట్ర వ్యాప్తంగా హోమియో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశ్వ మానవతా సంస్థ ప్రతినిధి పెమ్మాడి వీరభద్రరావు వర్మ, దేవస్థానంవలంటీర్లు ఎల్.తాతాజీ పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాలందాలి


కత్తిపూడిలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రజని

శంఖవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చిన్నారుల శారీరక అభివృద్ధికి సంమృద్ధిగా పోషకాలు అందాలని, వాటిని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తోందని ఏరియా సూపర్‌వైజర్ బీవీ రజని పేర్కొన్నారు. సోమవారం కత్తిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మహోత్సవంలో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఐదేళ్లలోపు ప్రతీచిన్నారిని దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. పిల్లలకు ప్రభుత్వం అందిస్తోన్న కార్యక్రమాలను వివరించారు. శాంతికుమారి, తల్లులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు

రంపచోడవరం, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): ముసురుమిల్లి ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో ఈనెల 8 నుంచి 10వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.భవాని సోమవారం తెలిపారు. 8న మండల స్థాయి, 9, 10వ తేదీల్లో డివిజన్ స్థాయి పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులను కోరారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో...

ఇద్దరికి జరిమానా, ముగ్గురికి జైలు

జగ్గంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని జగ్గంపేట పోలీసులు పెద్దాపురం కోర్టులో ప్రవేశ పెట్టారు. ఇద్దరికి రూ.10ల జరిమానా, ముగ్గురికి మూడు రోజుల చొప్పున జైలుశిక్ష విధించారు. ముగ్గురిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట-నరేంద్రపట్నం ఫీడర్, జగ్గంపేట ఇండస్ట్రియల్ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ వర్క్స్ కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. బావవరం, కాండ్రేగుల, గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాలకు, బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

'దాడి ఘటనపై సమగ్ర విచారణ చేయాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై జరిగిన దాడిని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కమిటీ ఖండించింది. కేసు విచారిస్తున్న సమయంలో ఒక న్యాయవాది ఆయనపై బూటు విసిరి దాడికి పాల్పడడాన్ని ఐలాజ్ ఖండించింది. ఇది కుల, మతపరమైన దాడిగా ఐలాజ్ భావిస్తున్నదని, ఈ మొత్తం ఘటనపై సమగ్ర విచారణ చేయాలని, షూ విసిరిన దుండగుడిపై తగిన చర్యలు తీసుకోవాలని ఐలాజ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

'వైసీపీ బలోపేతానికి కృషి'

ప్రత్తిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. ప్రత్తిపాడులో పినిశెట్టి ప్రకాష్ స్వగృహం వద్ద అభిమానులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. వివాహం చేసుకున్న ఎంపీటీసీ పినిశెట్టి అమృత వర్షిణి దంపతులను అభినందించారు. స్థానికులు గిరిబాబును సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వెంకటరత్నం, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

కిర్లంపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలకు ముప్పు ఉండదని జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణవరం అవుట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన వాహనాలను తనిఖీ జరిపారు. ద్విచక్ర వాహనదారులను నిలిపి పలు సూచనలు చేశారు. బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వారికి కౌన్సిలింగ్ చేశారు. కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది ఉన్నారు.



కొండల మధ్య మంచు దుప్పటి. పక్క చిత్రంలో బలరామపురం చెరువులో కమలాలు

ప్రకృతి అందాలు..ఇలా కనువిందు..

రౌతులపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం రౌతులపూడి గ్రామ శివారు నుంచి సుమారు ఇరవై కిలోమీటర్ల పొడవునా కొండల మధ్య దట్టమైన మంచు ఏర్పడింది. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు, ప్రకృతి ప్రేమికులు వాటిని తమ ఫోన్లలో పదిలపర్చుకున్నారు.

చెరువులో కమలాలు కనువిందు: బలరామపురం గ్రామశివారు చెరువులో విరబూసిన కమలాలు కనువిందు చేశాయి. చెరువు పక్కన నుంచి వెళ్లే స్థానికులు, ప్రయాణికులు వాటిని తమ ఫోన్లలో క్లిక్‌మనిపించారు.


పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రత్తిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం నియోజకవర్గానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు రూ.21,28,470 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే సత్యప్రభ అందజేశారు. కార్యక్రమంలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన నాయకులు వెన్నా శివ, బద్ది రామారావు, బద్ది రమణ, గౌసు స్వామి, సూది బూరయ్య, జ్యోతుల పెదబాబు, బస్వా ప్రసాద్, బస్వా సూరిబాబు, ధనేకుల వీరభద్రం, రౌతులపూడి మాజీ ఎంపీపీ ఇతంశెట్టి సూర్యభాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా శ్రీను నియామకం

ప్రత్తిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా ప్రత్తిపాడుకు చెందిన ధర్నాలకోట శ్రీను నియమితులయ్యారు. గత ఎనిమిదేళ్లుగా పీసీసీ సభ్యుడిగా పని చేస్తున్న శ్రీను సేవలను గుర్తించి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. సోమవారం నియామక పత్రాలను కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జేడీ శీలం ఆయనకు అందజేసి అభినందించారు.



డీసీసీ ఉపాధ్యక్షుడిగా శ్రీనుకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

లలితాదేవికి ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలోని పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి చెంతన కొలువై ఉన్న లలితాదేవికి పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఏకాదశ రుద్రాభిషేకం, మహిళలతో సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన జరిపారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఆలయ సేవా సమితి సభ్యులు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా నాగం


నాగం రమేష్

రౌతులపూడి, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఈనం గ్రామానికి చెందిన నాగం బుల్లి వెంకన్నదొర (రమేష్) నియమితులయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. రమేష్ ఎంపికపై ప్రత్తిపాడు ఇన్‌చార్జి నీరుకొండ సత్యనారాయణ, పీసీసీ కమిటీ మెంబర్ డి.శ్రీను తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


కనీస సౌకర్యాలు లేని పాలెం పశువైద్యశాల

పశు వైద్యశాలకు కనీస సౌకర్యాలేవి?

కిర్లంపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామంలోనున్న పశు వైద్యశాలకు కనీస సౌకర్యాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఐదు గ్రామాలకు సంబంధించిన ఈ పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుందని స్థానిక రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పశువులకు వైద్యం అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇక్కడున్న పశు వైద్యశాలకు కనీస సౌకర్యాలు కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.